epaper.samayamdaily.net
APTEL/26/A3949
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
SAMAYAM

సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 72 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 16 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

## రూ.2 వేలు దాటితే యూపీఐకి 'చార్జీలు'!



- చిన్న చెల్లింపులకు రుసుముల్లేవని కేంద్రం స్పష్టీకరణ
- పెద్ద వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్‌కు అవకాశం
- రేటు ఖరారుపై 22 మంది సభ్యుల కమిటీ కసరత్తు
- 'ప్రజలపైనే పరోక్ష భారం' అంటూ రాహుల్ ఫైర్
- 'చార్జీలు వస్తే మళ్లీ నగదు వైపే' అంటున్న అష్నీర్ గ్రోవర్

4

దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిత్యం వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై 'చార్జీల' చర్చ మొదలైంది. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని కేంద్రం సెప్టెంబర్ 14న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

## సోషల్ మీడియా ప్రభావం ఉండొద్దు




- న్యాయవ్యవస్థపై సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- విమర్శలకు అతీతంగా ఉండటం కూడా సరికాదు
- రామ్ జెఠ్మలానీ స్మారక ఉపన్యాసంలో ప్రసంగం
- ఈ-కోర్టుల ద్వారా సామాన్యుడికి చేరువగా సేవలు

2

## 2027 నాటికి 5.52 లక్షల ఇళ్లు

### అర్హులందరికీ పక్కా ఇళ్లే ప్రభుత్వ ధ్యేయం



గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

- వచ్చే నెలలోగా కొత్త పనుల గ్రౌండింగ్
- పారదర్శకంగా ఉచిత ఇళ్ల స్థలాల ఎంపిక
- శ్రీసిటీ తరహాలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లు
- కేంద్ర సహకారంతో మరిన్ని నిధుల సాధన
- గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశం

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలనే లక్ష్యంతో 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని పూర్తి సంతృప్తికర స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్ మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన గృహ నిర్మాణాలను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్లు నిర్మించాలని నిర్దేశించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు గృహ ప్రవేశాలు చేయించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వివిధ కేంద్ర పథకాల కింద ఇప్పటివరకు 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, 13.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 11.31 లక్షలు, టిడ్కో పరిధిలో 1.88 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త ఇళ్లను మంజూరు చేయించడంతో పాటు 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లోకి తేవడానికి కేంద్ర పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఇంటి స్థలాలు లేని నిరుపేదల వాస్తవ అవసరాలను గుర్తించేందుకు ఆర్టీజీఎస్, ఆవాస్ ప్లస్,

మిగతా 2 లో



మాజీ డిప్యూటీ సీఎం
## ఆళ్ల నాని మృతి

- విశాఖలో గుండెపోటుతో తుదిశ్వాస
- ఏలూరు జిల్లాలో విషాద ఛాయలు
- ఏపీ రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు
- ప్రముఖుల దిగ్భ్రాంతి

3

## మత్తు ఇంజెక్షన్ల దందా

- మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు
- రాష్ట్రవ్యాప్తంగా వంద చోట్ల దాడులు
- ఏభై ఐదు దుకాణాల్లో అక్రమాలు



వివరాలు 3లో..

## శ్రీవారికి సీఎం పట్టువస్త్రాలు

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు వైభవంగా సమర్పణ
రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని స్వామికి ప్రార్థన

2



## కోచింగ్ సెంటర్లలో రాజకీయం వద్దు!

2

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జీవో నంబరు 9 పాటించాల్సిందేనన్న సర్కారు
- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

## నిరుద్యోగులపై విషం చిమ్మొద్దు



2

- సాక్షి కథనాలపై మంత్రి అచ్చెన్న ఆగ్రహం
- అభ్యర్థుల విజ్ఞప్తి మేరకే పాత విధానం

## 5 లక్షల ఇళ్లు




3

- ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు
- దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు
- 'ఆవాస్ ప్లస్' యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు
- ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం

## త్వరలో ఇళ్ల పట్టాలు!

- జల జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు
- అధికారుల అలసత్వాన్ని సహించేది లేదు
- సమీక్షలో హోం మంత్రి అనిత హెచ్చరిక



వివరాలు 2వ పేజీలో

# కోచింగ్ సెంటర్లలో రాజకీయం వద్దు!


**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**జీవో నంబరు 9 పాటించాల్సిందేనన్న సర్కారు**

**అభ్యర్థులను నిరసనలకు ప్రేరేపిస్తే వేటు**

**అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. రాజకీయాలకు, కుట్రలకు ఈ కోచింగ్ కేంద్రాలు వేదిక కాకూడదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న కోచింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కొన్ని ప్రైవేటు కోచింగ్ సంస్థల యజమానులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను నిరసనలు, ఆందోళనల వైపు ప్రోత్సహిస్తున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వివిధ పరీక్షలకు సిద్ధం కావాల్సిన యువతను రాజకీయ ప్రేరేపిత నిరసనలకు ఉపయోగించుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. అభ్యర్థులను రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేసే సంస్థలపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు జీవో నంబరు 9 లోని మార్గదర్శకాలకు లోబడి మాత్రమే పనిచేయాలని సర్కారు తేల్చి చెప్పింది. వీటికి విరుద్ధంగా వ్యవహరించే కేంద్రాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తూ ఈ మార్గదర్శకాలు అమలయ్యేలా చూడాలన్నారు. అభ్యర్థులు కూడా ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా తమ భవిష్యత్తు, పోటీ పరీక్షల సన్నద్ధతపైనే పూర్తి దృష్టి సారించాలని ప్రభుత్వం సూచించింది. కోచింగ్ కేంద్రాల వద్ద ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరింది.

# నిరుద్యోగులపై విషం చిమ్మొద్దు

**సాక్షి కథనాలపై మంత్రి అచ్చెన్న ఆగ్రహం**

**ఐదేళ్లలో ఒక్క పోస్టయినా భర్తీ చేశారా?**

**మొదటి విడతలోనే 160 పోస్టుల భర్తీ**

**అభ్యర్థుల విజ్ఞప్తి మేరకే పాత విధానం**

**అమరావతి (సమయం న్యూస్):** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేక వారి అవకాశాలపై వైసీపీ, దాని కరపత్రం సాక్షి విషం చిమ్ముతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను రోడ్లపై తిప్పారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి విడతలోనే 160 పోస్టుల భర్తీకి శ్రీకారం చుడితే ఓర్వలేక తప్పుడు కథనాలతో అనుమానాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వడం తమ విధానమైతే, ఉద్యోగాలకు అడ్డుపడటమే వైసీపీ విధానమని స్పష్టం చేశారు.

**ఐదేళ్లలో ఒక్క పోస్టూ ఇవ్వలేదు..**



గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా భర్తీ చేయలేదని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం సుమారు 300 పోస్టులు ఖాళీగా ఉంటే కూటమి సర్కారు 160 పోస్టుల భర్తీకి వెంటనే అనుమతులు మంజూరు చేసిందన్నారు. అప్పట్లో నియామకాల ఊసే ఎత్తనివారు, ఇప్పుడు తాము పోస్టులు భర్తీ చేస్తుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ఉద్యోగాలు రావడం నచ్చడం లేదా, లేక కూటమి ప్రభుత్వంలో వస్తున్నాయన్న బాధా అని సూటిగా ప్రశ్నించారు.

**అభ్యర్థుల కోరిక మేరకే వెయిటేజీ..**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ద్వారానే వెటర్నరీ డాక్టర్ల నియామకాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి తప్పుడు రాతలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2016 నాటి 52 నంబరు జీవో ప్రకారం 100 మార్కులతో పారదర్శక వెయిటేజీ విధానం అమల్లో ఉందని తెలిపారు. గత 8 ఏళ్లుగా నియామకాలు జరగనందున, అకస్మాత్తుగా పరీక్ష పెడితే సీనియర్లు నష్టపోతారని నిరుద్యోగుల సంఘమే కోరడంతో మానవతా దృక్పథంతో ఆలోచించామన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోనూ ఇదే తరహా విధానం ఉందని గుర్తుచేశారు. ఏపీపీఎస్సీ పని ఒత్తిడి వల్ల ఈ ప్రక్రియను నిర్వహించలేమని చెప్పడంతో, 22 జీవో ద్వారా ఈ ఒక్కసారికి మాత్రమే పాత విధానంలో భర్తీ చేస్తున్నామని, భవిష్యత్ నియామకాలు ఏపీపీఎస్సీ ద్వారా రాతపరీక్షతోనే ఉంటాయని జీవోలోనే స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు.

**కనీస అవగాహన లేకుండా విషప్రచారం..**

పశుసంవర్ధక శాఖకు డైరెక్టర్‌గా ప్రస్తుతం ఓ మహిళా అధికారి ఇన్‌చార్జిగా కొనసాగుతుంటే, గతంలో పనిచేసిన అధికారి పేరును పేర్కొంటూ కథనాలు రాయడం సిగ్గుచేటని మంత్రి ఎద్దేవా చేశారు. శాఖకు డైరెక్టర్ ఎవరో కూడా తెలుసుకోలేని వారు జర్నలిజం ముసుగులో విషం కక్కుతున్నారని విమర్శించారు. నిరుద్యోగ యువత చేతుల్లో నియామక పత్రాలు చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టిస్తే సహించేది లేదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# 2027 నాటికి 5.52 లక్షల ఇళ్లు!



(మొదటి పేజీ తరువాయి..)

హౌసింగ్, రెవెన్యూ శాఖల డేటాను అనుసంధానం చేయాలని సీఎం తెలిపారు. ఎక్కడా డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించి, వచ్చిన అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలు ఖరారు చేయాలని ఆదేశించారు. గతంలో వేసిన లేఅవుట్లలో ఖాళీగా ఉన్న భూమిని అవసరాలకు తగినట్లుగా 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలోనూ సంపూర్ణ సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు.

**పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటు..**

కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్రంలోని కీలక ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించాలని సీఎం సూచించారు. శ్రీసిటీ తరహా పారిశ్రామిక వాడల సమీపంలో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పుంజుకుంటాయన్నారు. ఏపీఐఐసీ సంస్థతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలని గృహ నిర్మాణ శాఖకు నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఆర్థిక, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారికి సీఎం పట్టువస్త్రాలు!

- బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు వైభవంగా సమర్పణ
- రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని స్వామికి ప్రార్థన



**తిరుమల (సమయం న్యూస్):** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కుటుంబ సమేతంగా ముందుగా బేడి ఆంజనేయ స్వామివారిని దర్శించుకున్న సీఎం, అక్కడి నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం సీఎం శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని కూడా దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు. టీటీడీ అధికారులు సీఎంకు శ్రీవారి చిత్రపటాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

**సిరిసంపదలతో వర్ధిల్లాలి: సీఎం**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఏపీ దేశంలోనే అగ్రగామిగా నిలిచి అభివృద్ధిలో ముందుండేలా స్వామి ఆశీస్సులు అందించాలని కోరుకున్నానన్నారు. శ్రీవారికి 15వసారి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. టీటీడీ పాలకమండలి, అధికారులు క్రమశిక్షణతో భక్తులకు సేవలందిస్తున్న తీరును ఆయన అభినందించారు. మన ఆధ్యాత్మిక సంపద, సనాతన సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉద్ఘాటించారు.

**2027 డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ..**

2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం శ్రీవారి పెద్దశేష వాహన సేవలో పాల్గొని స్వామివారి వైభవాన్ని దర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్య ప్రసాద్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ పాలకమండలి సభ్యులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వేంకటేశ్వర్, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా బ్రహ్మోత్సవాలు!

- తిరుమలలో కన్నులపండువగా వేడుకలు
- మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- బంగారు ధ్వజస్తంభంపై ఎగిరిన గరుడధ్వజం
- మాడ వీధుల్లో మలయప్పస్వామి ఊరేగింపు

**తిరుమల (సమయం న్యూస్):** కలియుగ వైకుంఠం తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం ఆరు గంటల ఇరవై ఒకటి నిమిషాల నుంచి ఆరు గంటల ముప్పై ఐదు నిమిషాల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని కన్నులపండువగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను, అష్టదిక్పాలకులను ఆహ్వానించేందుకు ఈ ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని పండితులు తెలిపారు.

**మాడ వీధుల్లో ఊరేగింపు..**

ధ్వజారోహణానికి ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని కొలువుదీర్చారు. స్వామివారితో పాటు పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో కనులపండువగా ఊరేగించారు. ఈ విశేష కార్యక్రమంలో పెద్ద జీయర్, చిన్న జీయర్ స్వాములు, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, కంకణ బట్టర్ వెంకట రాఘవ దీక్షితులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, భాను ప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# త్వరలో ఇళ్ల పట్టాలు!

**జల జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు**

**అధికారుల అలసత్వాన్ని సహించేది లేదు**

**సమీక్షలో హోం మంత్రి అనిత హెచ్చరిక**



**నక్కపల్లి (సమయం న్యూస్):** పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో ఇల్లు ఉండి పట్టాలు లేని నిరుపేద అర్హులకు త్వరలోనే ఇళ్ల పట్టాలు అందిస్తామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అలాగే జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించేందుకు పక్కా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల అధికారులతో ఆమె సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, పీఆర్ ప్రాజెక్ట్స్, దేవాదాయ, పీఆర్ ఇంజినీరింగ్ శాఖల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, విధుల్లో ఎటువంటి అలసత్వాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పర్యాటక ప్రాంతంగా పోలవరం కాలువ పరిసరాలు..**

పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లి జిల్లాకు తీసుకురావడం ఎంతో సంతోషకరమైన పరిణామమని మంత్రి అన్నారు. పాయకరావుపేట ప్రాంతంలో పోలవరం కాలువ పరిసరాలను భవిష్యత్తులో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలిస్తామని వెల్లడించారు. అలాగే పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ ఆదా కోసం ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు, వివిధ రకాల వసతులు కల్పిస్తోందని చెప్పారు.

**గ్రామాల్లో సీసీ కెమెరాలు.. భద్రతకు పెద్దపీట..**

గ్రామస్థాయిలో ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హోం మంత్రి సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా పాయకరావుపేట నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

# సోషల్ మీడియా ప్రభావం ఉండొద్దు

**న్యాయవ్యవస్థపై సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** న్యాయవ్యవస్థపై సోషల్ మీడియా లేదా ఇతర బాహ్య శక్తుల ప్రభావం ఏమాత్రం ఉండకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. అలాగని విమర్శలకు న్యాయవ్యవస్థను అతీతంగా ఉంచడం కూడా సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో జరిగిన ఆరవ రామ్ జెఠ్మలానీ స్మారక ఉపన్యాసంలో 'జస్టిస్ మస్ట్ బి సీన్ టు బి డన్: ట్రాన్స్‌పరెన్సీ అండ్ పబ్లిక్ ట్రస్ట్ ఇన్ ద లీగల్ సిస్టమ్' అనే అంశంపై ఆయన ప్రత్యేకంగా ప్రసంగించారు. కోర్టుల పనితీరుపై వచ్చే నిర్మాణాత్మక విమర్శలు న్యాయవ్యవస్థలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పెంచడానికి ఎంతగానో తోడ్పడతాయని సీజేఐ తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే వ్యవస్థ ఎప్పుడూ పరిశీలనకు సిద్ధంగా ఉండాలని సూచించారు. న్యాయస్థానాలు తీర్పు ప్రకటించడంతో పాటు ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను ప్రజలు తెలుసుకునే అవకాశం కల్పించాలన్నారు. అప్పుడే వ్యవస్థలో పూర్తి పారదర్శకత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అయితే పారదర్శకత పేరుతో కోర్టు వ్యవహారాలను సోషల్ మీడియా అభిప్రాయాల ప్రభావానికి వదిలేయకూడదని ఆయన గట్టిగా హెచ్చరించారు.

**ఓడిన వ్యక్తికీ నమ్మకం కలగాలి..**

కేసులో ఓడిపోయిన వ్యక్తి కూడా తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పును వెలువరించిన ప్రక్రియ న్యాయంగా జరిగిందని నమ్మినప్పుడే న్యాయవ్యవస్థపై నిజమైన విశ్వాసం ఏర్పడుతుందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. 1924 నాటి ఇంగ్లండ్ కేసుకు సంబంధించిన 'ఆర్ వర్సెస్ సస్సెక్స్ జస్టిసెస్' వ్యవహారాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. న్యాయం జరగడం మాత్రమే కాకుండా, అది న్యాయంగా జరిగినట్లు కనిపించడం అంతే ముఖ్యమని వివరించారు. సామాన్యుడికి న్యాయం సులువుగా చేరేలా ఈ-కోర్టుల ప్రాజెక్టు, ఎలక్ట్రానిక్ సమన్లు, ఈ-సేవా కేంద్రాల వాహనాల ద్వారా సేవలను మరింతగా విస్తరిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# మత్తు ఇంజెక్షన్ల దందా!

- వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నడూ వెనుకడుగు వేయరు
- భీమిలి భూ వ్యవహారాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ప్రతిపక్ష నేతలు



**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాల్లో జరుగుతున్న అక్రమాలపై ఔషధ నియంత్రణ అధికారులు కొరడా ఝుళిపించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో డైరెక్టర్ జనరల్ అరుణ్ బాబు ఆధ్వర్యంలో 100 మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో 55 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి. ప్రధానంగా జంగారెడ్డిగూడెం పరిధిలో ట్రామడాల్ అనే మత్తు ఇంజెక్షన్లను ఎలాంటి అనుమతులు లేకుండా, నకిలీ బిల్లులతో అక్రమంగా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జీలుగుమిల్లి వద్ద ఓ తోటలో వాడేసిన ఇంజెక్షన్ల సీసాలు లభించడంతో అధికారుల దృష్టికి ఈ దందా వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన బృందాలు లోతైన దర్యాప్తు చేపట్టాయి. ఓ కార్పెంటర్ షాపులో దాచిపెట్టిన 7,550 ట్రామడాల్ ఇంజెక్షన్లను సీజ్ చేశారు. అలాగే నకిలీ బిల్లులు సృష్టించి మరో 3,930 ఇంజెక్షన్లు పక్క రాష్ట్రానికి తరలించినట్లు విచారణలో తేలింది. ఈ అక్రమాలకు పాల్పడిన మెడికల్ ఏజెన్సీల నిర్వాహకులు సహా 5 మందిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడుతున్న దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ అధికారులు స్పష్టం చేశారు.

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

**ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు**

**దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు**

**'ఆవాస్ ప్లస్' యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు**

**ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం**

**రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం**




**హైదరాబాద్/అమరావతి, సెప్టెంబరు 15 (సమయం న్యూస్):** సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కలిపి 5 లక్షల ఇళ్లు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, జలశక్తి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరైనట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లను కేటాయిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. 2024లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో మంజూరైన ఇళ్లకు అదనంగా మరిన్ని ఇళ్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు 'ఆవాస్ ప్లస్' మొబైల్ యాప్‌ను వినియోగించనున్నట్లు పెమ్మసాని తెలిపారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హత ఉన్న కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ప్రాథమికంగా రూ.1.20 లక్షలు, అదనంగా రూ.1.80 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. మరుగుదొడ్డి నిర్మాణానికి మరో రూ.12 వేల సాయం ఉంటుందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని పెమ్మసాని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్రం 1.75 లక్షల ఇళ్లు కేటాయిస్తే 42 వేల ఇళ్లు మాత్రమే నిర్మించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ఏడాది మరిన్ని ఇళ్లు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను రాబోయే 2-3 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# దక్షిణాఫ్రికాలో కామన్వెల్త్ సదస్సు!

**ఘనంగా 69వ పార్లమెంటరీ కాన్ఫరెన్స్**

**హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**ప్రారంభోత్సవంలో భారత ప్రతినిధులు**

**ప్రజాస్వామ్య విలువలపై విస్తృత చర్చ**



**కేప్‌టౌన్ (సమయం న్యూస్):** దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. కామన్వెల్త్ దేశాల మధ్య పార్లమెంటరీ విధానాలు, ప్రజాస్వామ్య విలువల బలోపేతం, పరస్పర సహకారం తదితర కీలక అంశాలపై లోతుగా చర్చించేందుకు ఈ అంతర్జాతీయ సదస్సును ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి విచ్చేసిన ప్రతినిధులతో కలిసి భారత ప్రజాప్రతినిధులు ఈ సదస్సులో చురుగ్గా పాల్గొంటున్నారు.

**భారత బృందం నుంచి ప్రముఖుల హాజరు..**

ఈ సదస్సుకు భారత ప్రతినిధి బృందం తరఫున పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు ఈ సమావేశంలో ప్రత్యేకంగా పాల్గొన్నారు. వీరితో పాటు భారత బృందంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, దగ్గుబాటి పురంధేశ్వరి తదితరులు ఈ ప్రారంభోత్సవ వేడుకలో పాలుపంచుకున్నారు.

# విద్యార్థులకు భారీ ఊరట

**ట్రంప్ వీసా నిబంధనలపై కోర్టు స్టే**

**విదేశీ విద్యార్థుల నివాస కాలంపై పాత విధానమే**

**భారతీయ విద్యార్థులకు కలగనున్న మేలు**

**బోస్టన్ ఫెడరల్ కోర్టు కీలక తీర్పు**

**వాషింగ్టన్ (సమయం న్యూస్):** అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న లక్షలాది మంది విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, విదేశీ జర్నలిస్టులకు అక్కడి ఫెడరల్ కోర్టు తీర్పుతో భారీ ఊరట లభించింది. విదేశీ విద్యార్థులు, జర్నలిస్టులు అమెరికాలో ఉండే కాలాన్ని నిర్దిష్ట సంవత్సరాలకే పరిమితం చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నిబంధనల అమలును బోస్టన్ నగరానికి చెందిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎఫ్. డెన్నిస్ సేలర్ సెప్టెంబర్ 14న నిలిపివేశారు. ఈ నిబంధనలు సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా, 1 రోజు ముందే న్యాయస్థానం స్టే విధించింది.



**4 ఏళ్ల గడువు నిబంధనకు బ్రేక్..**

ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన కొత్త విధానం ప్రకారం ఎఫ్ వీసాపై అమెరికాలో చదువుకునే అంతర్జాతీయ విద్యార్థులు, జే వీసాపై వెళ్లే ఎక్స్ఛేంజ్ విజిటర్లకు గరిష్ఠంగా 4 ఏళ్ల నివాస కాలాన్ని మాత్రమే పరిమితం చేయాలని ప్రతిపాదించారు. అలాగే అంతర్జాతీయ మీడియా సంస్థలకు చెందిన పాత్రికేయులు ఉపయోగించే ఐ వీసా గడువును గరిష్ఠంగా 240 రోజులకు కుదించాలని నిర్ణయించారు. అంతకుమించి అక్కడ ఉండాలంటే ప్రత్యేకంగా గడువు పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది.

అమెరికాలో గత 50 ఏళ్లుగా కొనసాగుతున్న 'డ్యురేషన్ ఆఫ్ స్టేటస్' విధానాన్ని ఈ తాజా నిబంధనలు రద్దు చేసేలా ఉన్నాయి. ప్రస్తుత విధానంలో విద్యార్థి తన చదువును నిబంధనల ప్రకారం కొనసాగిస్తున్నంత కాలం అమెరికాలో ఉండే అవకాశం ఉంటుంది. మాటిమాటికీ పొడిగింపు కోసం దరఖాస్తు చేయాల్సిన పనిలేదు. తాజా కోర్టు ఆదేశాలతో ప్రస్తుతానికి ఈ పాత విధానమే కొనసాగనుంది.

**కోర్టులో వీగిపోయిన ప్రభుత్వ వాదన..**

జాతీయ భద్రత, వీసా వ్యవస్థ దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ కోర్టులో వాదించింది. అయితే ప్రభుత్వ వాదనల్లో పస లేదని, తక్కువ భారం చూపే ప్రత్యామ్నాయాలను పరిశీలించడంలో విఫలమైందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే అమెరికా విశ్వవిద్యాలయాల్లో విదేశీ విద్యార్థుల చేరికలు తగ్గి, విద్యాసంస్థలు ఆర్థికంగా భారీగా నష్టపోతాయని కోర్టు వ్యాఖ్యానించింది. విదేశీ విద్యార్థులు అమెరికా పరిశోధనలు, ఆర్థిక వ్యవస్థకు ఎంతో దోహదపడుతున్నారని గుర్తుచేసింది. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 16 లక్షల మంది ఎఫ్ వీసాదారులు, మరో 5 లక్షల మంది జే వీసాదారులు ఉన్నారని రాయిటర్స్ సంస్థ పేర్కొంది.

**భారతీయ విద్యార్థులకు ఉపశమనం..**

అమెరికాలోని భారతీయ విద్యార్థులకు ఈ తీర్పు ఎంతో ఊరటనిచ్చింది. ముఖ్యంగా 4 ఏళ్లకు మించి కొనసాగే పీహెచ్‌డీ, ఉన్నత పరిశోధనలు చేస్తున్న విద్యార్థులకు వీసా పొడిగింపు తలనొప్పులు తప్పాయి. అయితే ఇది తాత్కాలిక నిలుపుదల ఉత్తర్వు మాత్రమేనని, తదుపరి తుది విచారణ ఆధారంగా పరిస్థితులు మారే అవకాశముందని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని మృతి!

**విశాఖలో గుండెపోటుతో తుదిశ్వాస**

**ఏలూరు జిల్లాలో విషాద ఛాయలు**

**ఏపీ రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు**

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రముఖులు**

**ఏలూరు (సమయం న్యూస్):** ఏలూరు మాజీ శాసనసభ్యుడు, మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) ఆకస్మికంగా కన్నుమూశారు. విశాఖపట్నంలో గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలియగానే ఏలూరు జిల్లాతో పాటు యావత్ ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆళ్ల నాని 2004, 2009 ఎన్నికల్లో ఏలూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున వరుసగా విజయం సాధించారు. ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి క్రియాశీలకంగా వ్యవహరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు నుంచి మళ్లీ ఘన విజయం సాధించిన ఆయన.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం టీడీపీలో చేరి కొనసాగుతున్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ, నియోజకవర్గ ప్రజలతో నిత్యం మమేకమయ్యే నేతగా ఆయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



**ప్రముఖుల తీవ్ర దిగ్భ్రాంతి..**

ఆళ్ల నాని మృతి పట్ల రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివాదాలకు తావులేకుండా, అందరితో ఎంతో స్నేహపూర్వకంగా మెలిగే మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. వారి పవిత్ర స్మృతికి నివాళులర్పిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందిస్తూ.. ఆళ్ల నాని ఆకస్మిక మృతి తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ఈ తీరని శోకం నుంచి కోలుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయన మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

# బిహార్ వరద బాధితులకు ఆర్థిక సాయం

**8.27 లక్షల కుటుంబాలకు సర్కారు బాసట**

**బ్యాంకు ఖాతాల్లో రూ.7 వేల చొప్పున జమ**

**పాట్నా (సమయం న్యూస్):** బిహార్‌లో వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా వరదల ప్రభావానికి గురైన 8.27 లక్షల కుటుంబాలకు రూ.579.23 కోట్ల ఆర్థిక సాయాన్ని విడుదల చేసింది. ఒక్కో కుటుంబానికి రూ.7 వేల చొప్పున డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో సుమారు 49.72 లక్షల మంది వరదల బారిన పడ్డారని అధికారులు తెలిపారు. బాధితులకు నిత్యావసరాలు, పునరావాస సదుపాయాలు కల్పించేందుకు యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోంది.

# ఢిల్లీలో 53 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు పోస్టుల మంజూరు

**నియామకాలకు లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో కేసుల విచారణను వేగవంతం చేసేందుకు కొత్తగా ఏర్పాటు చేయనున్న 53 ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టుల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈ కోర్టులకు అవసరమైన 427 అనుబంధ పోస్టుల సృష్టికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ కొత్త పోస్టుల ఏర్పాటు ద్వారా న్యాయస్థానాల్లో సిబ్బంది కొరత తీరి, కేసుల పరిష్కారం వేగవంతం కానుంది. ఈ పోస్టుల నిర్వహణ కోసం సుమారు రూ.37.37 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుందని అంచనా వేశారు.

# పండుగల రద్దీకి 100 ప్రత్యేక రైళ్లు

**ప్రయాణికుల కోసం రైల్వే శాఖ భారీ ఏర్పాట్లు**

**దుర్గాపూజ, దీపావళి, ఛఠ్ వేళ అదనపు సర్వీసులు**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** రాబోయే దుర్గాపూజ, దీపావళి, ఛఠ్ పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 100 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు వెల్లడించింది. ప్రధాన నగరాలు, వివిధ రాష్ట్రాల మధ్య ఈ అదనపు రైలు సర్వీసులను అందుబాటులోకి తేనున్నారు. పండుగల సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశమని రైల్వే అధికారులు తెలిపారు.

# రష్యాలో యూపీ యువకుల అదృశ్యం

**లక్నో (సమయం న్యూస్):** పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు చెందిన 3 గురు యువకులు రష్యాలో అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ముజఫర్‌నగర్‌కు చెందిన హిమాన్షు శర్మ (24), శక్తి పుండీర్ (23), షామ్లీకి చెందిన ఆశు సైనీ (25) జూలై 30 నుంచి కుటుంబ సభ్యులతో సంబంధాలు కోల్పోయారు. స్టూడెంట్ వీసాలపై మాస్కో వెళ్లి భాషా కోర్సు చదువుతున్న వీరి వద్ద నుంచి ఏజెంట్ ఒక్కొక్కరికి రూ.3.5 లక్షలు తీసుకున్నాడు. చదువుతో పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తీసుకెళ్లారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాస్‌పోర్టులు లాక్కున్నారని, ఉక్రెయిన్‌పై యుద్ధం చేయాలని రష్యా సైన్యం బలవంతం చేస్తోందని యువకులు చివరిసారిగా ఫోన్ చేసి చెప్పినట్లు కుటుంబాలు తెలిపాయి. ఆ తర్వాత వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. తమ పిల్లలను సురక్షితంగా రప్పించాలని బాధితుల తల్లిదండ్రులు కేంద్ర విదేశాంగ శాఖను కోరారు.




# ఉద్యోగం పోయింది

## ఉదయం 6 గంటలకే మెయిల్!

**ఒరాకిల్‌లో మరో విడత భారీ లేఆఫ్స్**

**సమాచారం అందిన రోజే చివరి పనిదినం**

**కృత్రిమ మేధపై భారీగా పెట్టుబడులు**

**ఇప్పటికే 21 వేల మంది ఉద్యోగులకు కోత**

**ఓవైపు ఏఐ విస్తరణ.. మరోవైపు ఖర్చుల కత్తెర**

**న్యూయార్క్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** టెక్ ఉద్యోగులను 'లేఆఫ్స్' భయం వెంటాడుతూనే ఉంది. ఎప్పుడు ఉద్యోగం పోయిందంటూ ఈమెయిల్ వస్తుందో తెలియని పరిస్థితుల్లో తాజాగా అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్‌లో మరో విడత ఉద్యోగాల కోతలు మొదలైనట్లు సమాచారం. ప్రభావిత ఉద్యోగులకు ఉదయం 6 గంటలకే ఈమెయిల్ పంపి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు తెలియజేసినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ నివేదించింది. సంస్థలో జరుగుతున్న విస్తృత పునర్వ్యవస్థీకరణలో భాగంగానే తాజా కోతలు చేపట్టినట్లు తెలుస్తోంది. సోమవారం నుంచి తాజా లేఆఫ్స్ మొదలైనట్లు సమాచారం. ఉద్యోగాలు కోల్పోయిన కొందరు లింక్డ్‌ఇన్, రెడిట్, బ్లైండ్ వంటి వేదికల్లో తమ అనుభవాలను వెల్లడించారు. ముగ్గురు ప్రభావిత ఉద్యోగులతో మాట్లాడడంతోపాటు సంస్థ పంపిన అంతర్గత నోటిఫికేషన్‌ను పరిశీలించినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ పేర్కొంది. సంస్థాగత మార్పుల్లో భాగంగా ఆయా ఉద్యోగుల పాత్రలను తొలగిస్తున్నట్లు ఉదయం అందిన ఈమెయిల్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాదు.. నోటిఫికేషన్ అందుకున్న రోజే చివరి పనిదినంగా నిర్ణయించినట్లు నివేదికలు చెబుతున్నాయి. తాజా విడతలో మొత్తం ఎంతమంది ఉద్యోగాలు కోల్పోయారన్న విషయాన్ని మాత్రం ఒరాకిల్ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఒకవైపు ఉద్యోగులను తగ్గిస్తున్న ఒరాకిల్.. మరోవైపు కృత్రిమ మేధ, క్లౌడ్ మౌలిక సదుపాయాల విస్తరణకు భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సంస్థ మూలధన వ్యయం 28.5 బిలియన్ డాలర్లకు చేరినట్లు పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో 8.5 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ వ్యయం ఏడాదిలో మూడు రెట్లకుపైగా పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 90 నుంచి 95 బిలియన్ డాలర్ల వరకు మూలధన వ్యయం చేయాలన్న అంచనాను కొనసాగిస్తోంది. ఒరాకిల్ ఏఐ వ్యాపారానికీ భారీ డిమాండ్ కనిపిస్తోంది. ఒక్క త్రైమాసికంలోనే 30 బిలియన్ డాలర్లకుపైగా అదనపు ఏఐ క్లౌడ్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో మిగిలిన పనితీరు బాధ్యతల విలువ 664 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే ఏఐ విస్తరణకు చేస్తున్న భారీ పెట్టుబడులు నగదు ప్రవాహంపై ప్రభావం చూపుతున్నాయి. త్రైమాసికంలో సంస్థ స్వేచ్ఛా నగదు ప్రవాహం 5.4 బిలియన్ డాలర్ల మేర ప్రతికూలంగా నమోదైంది. డేటా సెంటర్లపై వ్యయం భారీగా పెరుగుతున్న సమయంలో ఖర్చులను అదుపు చేసేందుకు ఉద్యోగాల కోతలూ కొనసాగుతున్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# సౌదీ దాడులతో ఎగిసిన చమురు ధరలు

**బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 105.89 డాలర్లు**

**రియాద్ (సమయం న్యూస్):** సౌదీ అరేబియాలోని ఇంధన మౌలిక వసతులపై జరిగిన తాజా దాడుల కారణంగా కీలకమైన ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్ నిలిచిపోయింది. దీంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడి ధరలు భారీగా ఎగబాకాయి. మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 105.89 డాలర్లకు, అమెరికా డబ్ల్యూటీఐ ధర 102.29 డాలర్లకు చేరింది. పైప్‌లైన్ నిలిచిపోవడం వల్ల ప్రపంచ చమురు సరఫరాలో 4 శాతం వరకు కోత పడే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఉద్రిక్తతలు కొనసాగితే ధరలు 120 నుంచి 130 డాలర్లకు చేరే అవకాశముంది. మధ్యప్రాచ్య సంక్షోభం, హోర్ముజ్ జలసంధిలో నౌకా రాకపోకలు తగ్గడం మార్కెట్లను మరింత ఒత్తిడికి గురిచేస్తున్నాయి.ఒరాకిల్‌లో ఈ ఏడాది ఉద్యోగాల కోతలు ఇదే తొలిసారి కాదు. 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 21 వేల మంది ఉద్యోగులను తగ్గించినట్లు సమాచారం. ఇది మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 13 శాతానికి సమానం. మే 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం చివరికి సంస్థలో సుమారు 1.41 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, అంతకుముందు ఏడాది ఈ సంఖ్య దాదాపు 1.62 లక్షలుగా ఉంది. ఉద్యోగుల తొలగింపులు, ఇతర పునర్వ్యవస్థీకరణ చర్యలకు సంబంధించి 2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ సుమారు 1.84 బిలియన్ డాలర్లను సెవరెన్స్, ఇతర ఎగ్జిట్ ఖర్చులుగా వెచ్చించినట్లు సమాచారం.

# గాజా శిథిలాల్లో వందలాది మృతదేహాలు

**దాడుల విధ్వంసంపై ఐరాస తీవ్ర దిగ్భ్రాంతి**

**యుద్ధ నేరాలపై విచారణ జరపాలని డిమాండ్**

**జెనీవా (సమయం న్యూస్):** గాజాలో ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో ధ్వంసమైన భవనాల శిథిలాల నుంచి పెద్ద సంఖ్యలో మృతదేహాలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పటివరకు 630కి పైగా మృతదేహాలు, అవశేషాలను వెలికితీసినట్లు పాలస్తీనా సివిల్ డిఫెన్స్ వెల్లడించింది. అక్కడ యుద్ధ నేరాలు జరిగి ఉండవచ్చని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నారులతో పాటు కుటుంబాలు మొత్తం ఉన్నట్లు తెలిపారు. ఇంకా 8,000 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఘటనలకు సంబంధించిన ఆధారాలు సేకరించేందుకు స్వతంత్ర అంతర్జాతీయ బృందాలకు ప్రవేశం కల్పించాలని ఐరాస కోరింది. అయితే పౌరులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోలేదని, అంతర్జాతీయ చట్టాల పరిధిలోనే పనిచేస్తున్నామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

# రూ.2 వేలు దాటితే యూపీఐకి 'చార్జీలు'!

- చిన్న చెల్లింపులకు రుసుముల్లేవని కేంద్రం స్పష్టీకరణ
- పెద్ద వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్‌కు అవకాశం
- రేటు ఖరారుపై 22 మంది సభ్యుల కమిటీ కసరత్తు
- 'ప్రజలపైనే పరోక్ష భారం' అంటూ రాహుల్ ఫైర్
- 'చార్జీలు వస్తే మళ్లీ నగదు వైపే' అంటున్న అష్నీర్ గ్రోవర్




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా కోట్లాది మంది నిత్యం వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై 'చార్జీల' చర్చ మొదలైంది. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థల సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని కేంద్రం సెప్టెంబర్ 14న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపారి చెల్లింపులపై భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేటు విధించే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయంగా దుమారం రేపుతోంది. 2007 నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏ కింద ఈ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ చట్టానికి సంబంధించిన సవరణ బిల్లు ఆమోదం పొందింది. ఆగస్టు 13న సమావేశాలు ముగిసిన అనంతరం యూపీఐపై ఎండీఆర్ రేట్లకు సంబంధించిన అంశాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ పరిశీలిస్తుందని కేంద్రం తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం లావాదేవీ మొత్తం ఎంత ఉన్నా సాధారణ యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ లేదు. రూ.2 వేల వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులకు ఎలాంటి రుసుము ఉండదని స్పష్టత వచ్చినప్పటికీ.. ఆ పరిమితి దాటిన వ్యాపారి లావాదేవీలపై ఎండీఆర్ ఎంత ఉండాలన్నది ఇంకా ఖరారు కాలేదని సంబంధిత వర్గాల సమాచారం. బ్యాంకులు, సేవల సంస్థల ప్రతినిధులతో కూడిన 22 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీ స్వయం సుస్థిరత, మార్కెట్ విస్తరణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. పెద్ద వ్యాపారి చెల్లింపులపై 0.3 నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్ ఉండొచ్చన్న ప్రచారం సాగుతున్నప్పటికీ అధికారిక రేటు ఇంకా ఖరారు కాలేదు. వారంలో నిర్ణయం వెలువడి అక్టోబర్ నుంచి అమల్లోకి రావచ్చన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. వ్యక్తి నుంచి వ్యక్తికి పంపుకునే నగదు బదిలీలపై మాత్రం ఈ రుసుము వర్తించదని, చర్చ ప్రధానంగా వ్యాపారులకు చేసే చెల్లింపులపైనేనని సమాచారం. బ్రెజిల్‌లోని పీఐఎక్స్ చెల్లింపు వ్యవస్థలో 0.33 శాతం, చైనాలోని చెల్లింపు వ్యవస్థల్లో సుమారు 0.40 శాతం మర్చంట్ రేటు ఉన్నట్లు పేర్కొంటున్నారు. భారత్‌లో ఎంత రేటు నిర్ణయిస్తారన్నది తేలాల్సి ఉంది.

**'నిశ్శబ్దంగా మార్గం సుగమం చేశారు'**



ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. యూపీఐపై ఫీజులు విధించేందుకు మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందని ఆరోపించారు. రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపారి లావాదేవీలు సంఖ్యాపరంగా స్వల్పమే అయినప్పటికీ మొత్తం యూపీఐ లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి నేరుగా చార్జీ వసూలు చేయబోమని ప్రభుత్వం చెప్పినా వ్యాపారులపై పడే ఎండీఆర్ భారాన్ని వారు వస్తువులు, సేవల ధరల్లో కలిపే అవకాశం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమంగా ఆ భారాన్ని సామాన్య వినియోగదారులే భరించాల్సి వస్తుందని విమర్శించారు.

**'మళ్లీ క్యాష్ వైపు మళ్లే ప్రమాదం'**



యూపీఐపై చార్జీల ఆలోచనను భారత్‌పే సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ కూడా వ్యతిరేకించారు. విజయవంతంగా పనిచేస్తున్న వ్యవస్థపై రుసుము విధించడం పరోక్ష పన్నులాంటిదేనని వ్యాఖ్యానించారు. రూ.2 వేల పరిమితిని ఎందుకు నిర్ణయించారన్నదే తన ప్రశ్న అని పేర్కొన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలు సంఖ్యాపరంగా దాదాపు 4 శాతమే అయినప్పటికీ మొత్తం లావాదేవీల విలువలో వాటి వాటా సుమారు 66 శాతమని గ్రోవర్ పేర్కొన్నారు. పెద్ద మొత్తాలపై ఎండీఆర్ విధిస్తే వ్యాపారులు ఆ భారాన్ని వినియోగదారులపై మోపే అవకాశం ఉందన్నారు. లేదంటే రూ.12 వేల చెల్లింపును రూ.2 వేల చొప్పున పలుమార్లు చేసే పరిస్థితులు ఏర్పడవచ్చని అభిప్రాయపడ్డారు. దుకాణదారులు రూ.2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులు తీసుకునేందుకు వెనుకాడి నగదు కోరే పరిస్థితి కూడా రావచ్చని హెచ్చరించారు. అలా జరిగితే నగదు వినియోగం పెరగడంతోపాటు మరిన్ని ఏటీఎంలు, నగదు నిర్వహణ కేంద్రాల అవసరం ఏర్పడుతుందని పేర్కొన్నారు. యూపీఐ వ్యవస్థకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల అసలు ఎవరికి నష్టం జరుగుతోందో చెప్పాలని గ్రోవర్ ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంకు నుంచి ప్రభుత్వానికి రూ.2.87 లక్షల కోట్ల మిగులు బదిలీ జరిగిందని, లిస్టెడ్ బ్యాంకుల మొత్తం లాభాలు రూ.4.11 లక్షల కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ పన్నుకు ముందు మిగులు రూ.1,888 కోట్లుగా ఉందని గుర్తుచేశారు. అయితే రూ.2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులకు చార్జీలు ఖరారయ్యాయని ఇప్పుడే భావించడానికి వీల్లేదు. ప్రస్తుతం చర్చలో ఉన్నది ప్రధానంగా వ్యాపారి చెల్లింపులపై ఎండీఆర్ విధించే అవకాశమే. రేటు, అమలు తేదీపై అధికారిక నిర్ణయం వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

## దేశం నుంచి ఆశించడమే కాదు..

# సేవ చేయండి

**జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల పిలుపు**

**దేశ హితానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**

**అనిశ్చితిలోనూ 7.8 శాతం వృద్ధి సాధించామని వెల్లడి**

**తమిళనాడులో ఉపాధి అవకాశాలు పుష్కలమని వ్యాఖ్య**



**చెన్నై, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** దేశం నుంచి మనం ఏం ఆశిస్తున్నామన్న దానికంటే.. దేశం కోసం మనం ఏం చేయగలమన్నదే యువత ఆలోచించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా జెన్ జెడ్, జెన్ ఆల్ఫా తరాలు నాయకత్వ బాధ్యతలు చేపట్టి దేశ హితానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యువత ఆకాంక్షలను వినేందుకు దేశం సిద్ధంగా ఉందని, అదే సమయంలో పౌరులుగా తమ బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని హితవు పలికారు. చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో మంగళవారం నిర్మల సీతారామన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వ బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని పేర్కొన్నారు. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి అంతర్జాతీయ పరిణామాలను ప్రస్తావించిన ఆమె.. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రత, స్థిరత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు.

**అనిశ్చితిలోనూ 7.8 శాతం వృద్ధి**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. తమిళనాడు పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు కీలక కేంద్రంగా ఎదిగిందన్నారు. ముఖ్యంగా శ్రీపెరంబుదూర్--ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ ఎగుమతులకు అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని చెప్పారు. కోయంబత్తూరు, మధురై నగరాల్లో ఏర్పాటైన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని వివరించారు. విద్యతోపాటు వినయం ముఖ్యమని, అహంకారాన్ని వీడి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని యువతకు నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు.






# ఇదొక కపట నాటకం, బూటకపు ప్రకటన

**'గిమ్మిక్కులతో ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించొద్దు'**

**'మసూద్‌పై రివార్డు పెంపుపై భారత్ తీవ్ర స్పందన**

**మాటలు కాదు.. చేతల్లో చూపాలన్న విదేశాంగ శాఖ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ అధినేత, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజర్‌పై రివార్డును పెంచుతూ పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంపై భారతదేశం అత్యంత తీవ్రస్థాయిలో స్పందించింది. పాకిస్థాన్ ప్రకటనను 'కపట నాటకం' అని, ప్రపంచ దేశాల కళ్లలో దుమ్ముగొట్టేందుకు ఆడుతున్న బూటకపు గిమ్మిక్కు అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. ఉగ్రవాదానికి స్వర్గధామంగా మారిన ఒక దేశం నుంచి ఇలాంటి ప్రయోజనం లేని ప్రకటనలు రావడం కొత్తేమీ కాదని, కేవలం మాటలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకున్నప్పుడే దానికి ప్రాధాన్యత ఉంటుందని మంగళవారం మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) తమ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల 'రెడ్ బుక్ 2026' జాబితాలో మసూద్ అజర్ పేరును కొనసాగిస్తూ, అతనిపై ఉన్న రివార్డును మరో 20 లక్షల పాకిస్తానీ రూపాయలు పెంచి మొత్తం పీకేఆర్ 70 లక్షలకు (భారత కరెన్సీలో సుమారు రూ. 24 లక్షలు) చేర్చింది. వచ్చే అక్టోబర్‌లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ప్లీనరీ సమావేశం జరగనున్న నేపథ్యంలో, మళ్లీ 'గ్రే లిస్ట్' ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి పాకిస్థాన్ ఈ తరహా నాటకానికి తెరతీసిందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు విశ్లేషిస్తున్నారు. మసూద్ అజర్ తమ దేశంలో లేడని, ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నాడని పాక్ సాకులు చెబుతున్నప్పటికీ, ఆ ఉగ్రవాది పాక్ రక్షణలోనే సురక్షితంగా ఉన్నాడని భారత్ గట్టిగా వాదిస్తోంది.

# వైభవంగా వినాయక చవితి!

- ఒంగోలులో ఘనంగా గణనాథుడి నవరాత్రులు
- ఆకట్టుకుంటున్న వైవిధ్యమైన గణపతి ప్రతిమలు
- పెన్నుల గణపతి, వృక్ష వినాయక రూపాలు
- మంత్రోచ్చారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి



**ఒంగోలు (సమయం న్యూస్):** నగరంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి వీధిలోనూ విఘ్నేశ్వరుని మండపాలు వెలిశాయి. భక్తుల కోలాహలంతో సందులన్నీ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో భారీ విగ్రహాలతో పాటు వైవిధ్యమైన, సృజనాత్మక వినాయకుని రూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దక్షిణం బజారులో ఏర్పాటు చేసిన పెన్నుల గణపతి విద్యార్థులను, ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తోంది. రంగు తోట ప్రాంతంలో తల్లిదండ్రులైన శివపార్వతుల చుట్టూ భక్తితో ప్రదక్షిణ చేస్తున్న భక్తి గణపతి ప్రతిమ విశేషంగా నిలిచింది. గ్రంథాలయం వద్ద భక్తులకు అభయమిస్తూ పంచముఖ గణపతి దర్శనమిస్తున్నాడు. మాతా శిశు వైద్యశాల ఎదురుగా ఆధ్యాత్మిక నిలయంలా కన్నులవిందు చేస్తున్న విశిష్టమైన ఆలయ మండపాన్ని ఏర్పాటు చేశారు. తాబేలుపై ఆసీనుడైన గణపయ్య, ప్రకృతి సందేశాన్నిచ్చే వృక్ష గణపతి ఇలా వేలాది విభిన్న రూపాల్లో లంబోదరుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు.

### సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం..

పురోహితుల వేద మంత్రోచ్చారణలు, దగద్ధగమనే దీప కాంతులతో మండపాలన్నీ వెలిగిపోతున్నాయి. పూజల నిర్వహణతో పాటు శ్రావ్యమైన భక్తి గీతాల గాన మాధుర్యాలు, పురాణ ప్రవచనాలు, శోభాయమానమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను పరవశింపజేస్తున్నాయి. పడతుల అలంకరణలు, యువకుల కేరింతలు, కోలాటాలతో ఉత్సవ పరిసరాలన్నీ సందడిగా మారాయి. స్వామివారిని దర్శించుకుని తరించడానికి భక్తులు కుటుంబ సమేతంగా తండోపతండాలుగా తరలివస్తున్నారు



## ఆరోగ్య కేంద్ర ప్రయోగశాల పరిశీలన

**తెనాలి, సెప్టెంబర్15:** స్థానిక పినపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రయోగశాలను మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు, పట్టణ సబ్ యూనిట్ ఆఫీసర్ అందెబాలచంద్రమౌళి పరిశీలించారు.కీటక జనిత వ్యాధుల తీవ్రత , క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది రక్తపూతల నమూనాల సేకరణ,తదుపరి ప్రయోగశాలకు పంపించుట తదితర అంశములను క్షుణ్ణంగా పరిశీలించారు. రక్త నమునాల సేకరణ పరీక్షలకు సంబంధించి తగు సూచనలు , సలహాలను ల్యాబ్ టెక్నీషియన్ కు తెలియజేశారు.ఈసందర్భంగా తెనాలి పట్టణ సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు కీటక జనిత వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలని,నీటి నిల్వలు లేకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, ఫార్మసిస్ట్ సంధ్యారాణి,ల్యాబ్ టెక్నీషియన్ పత్తి సుధీర్ కుమార్ , హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ కరిముల్లా, డీఈవో గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ స్వగృహ భవనాల వేలానికి ప్రణాళిక సిద్ధం చేయండి



**నరసరావుపేట, సెప్టెంబర్ 15 :** అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ భవనాల వేలం కోసం ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి సమర్పించాలని, అలాగే వినియోగంలో లేని భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించడానికి అవసరమైన చర్యలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక లింగంగుంట్లలోని రాజీవ్ స్వగృహ భవనాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న భవనాలు, నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వేలం ప్రక్రియకు అవసరమైన అన్ని చర్యలను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని, ప్రస్తుతం వినియోగంలో లేని భూమిని తక్షణమే గుర్తించి తిరిగి ప్రభుత్వానికి అప్పగించేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులు ఏమాత్రం వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకునేలా అధికారులు చొరవ చూపాలని, రాజీవ్ స్వగృహ నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

## హౌసింగ్ శాఖ కార్యాలయంలో ఘనంగా విశ్వేశ్వరయ్య జయంతి



**నరసరావుపేట, సెప్టెంబర్ 15:** స్థానిక హౌసింగ్ జిల్లా కార్యాలయంలో ప్రముఖ భారతీ-య ఇంజనీర్, పండితుడు, రాజనీతిజ్ఞుడు 'భారతరత్న' సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పాత్ర చిరస్మరణీయమని, అందుకే ఆయన జన్మదినమైన సెప్టెంబరు 15ను దేశవ్యాప్తంగా 'ఇంజనీర్స్ డే'గా జరుపుకుంటున్నామని కొనియాడారు. 1861 సెప్టెంబరు 15న జన్మించి 1962 ఏప్రిల్ 12 వరకు జీవించిన ఆయన, మైసూరు సంస్థానానికి 1912 నుండి 1918 వరకు దివాన్‌గా పనిచేసి అద్భుత ప్రగతి సాధించారని తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మాణానికి చీఫ్ ఇంజనీర్‌గా వ్యవహరించడంతో పాటు, హైదరాబాదు నగరాన్ని మూసీ నది వరదల నుంచి రక్షించడానికి పటిష్టమైన వరద నివారణ పథకాలను రూపొందించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. ఆయన ప్రజలకు చేసిన విశిష్ట సేవలను గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం 'నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్' (ఖజ×జు) బిరుదునివ్వగా, భారత ప్రభుత్వం 1955లో దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించిందని పేర్కొన్నారు. ఇంజనీర్లందరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జిల్లా ఆఫీసు సిబ్బంది, ఈఈ కార్యాలయ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలిరెడ్డిపాలెంలో వైభవంగా గణపతి పూజ

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న జనసేన నాయకులు



**చిలకలూరిపేట సెప్టెంబర్ 15 :** పోలిరెడ్డిపాలెంలోని ప్రథమ లైనులో జీబీస్ యూత్ ఆధ్వర్యంలో గణపతి పూజా మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడింది.

ఈ పూజా కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా చిలకలూరిపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తోట రాజా రమేష్, నియోజకవర్గ జనసేన యువ నాయకులు ప్రధాత మండలనేని చరణ్ తేజ, టౌన్ ప్రెసిడెంట్ మునీర్ హాసన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ అముదాల లీలా కిషోర్, పార్టీ వీర మహిళలు, నాయకులు తదితరులు విచ్చేసి, విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని కృపాకటాక్షములతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవములను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమములో జీబీస్ యూత్ సభ్యులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువత మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు.

## గుంతలు లేని రోడ్లే లక్ష్యం

### పాట్‌హోల్స్‌ను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి: కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, సెప్టెంబర్ 15 :** గుంటూరు నగరంలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యానగర్, వికాస్‌నగర్, జేకేసీ కాలేజీ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే పనులు రద్దు చేయాలని ఆదేశించారు. రోడ్లు, డ్రెయిన్ల పక్కన అక్రమంగా నిర్మాణ సామగ్రి ఉంచితే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ యూనిట్లను గుర్తించి సీజ్ చేయాలని, వినాయక మండపాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అమెరికాలో కీలక వడ్డీ రేట్ల పెంపు అంచనా

# హెచ్ఐవిపై విద్యార్థులకు అవగాహన!

- కోరు ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో సదస్సు
- మాదకద్రవ్యాలు, ఎయిడ్స్‌పై హెచ్చరికలు
- పెడదోవ పట్టవద్దన్న ఉపాధ్యాయులు
- చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ



**కొండపి (సమయం న్యూస్):** ప్రకాశం జిల్లా కొండపి మండలం కోరు ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. సుసన్నకుమార్ అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది.

### వ్యసనాలకు దూరంగా ఉండాలి..

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. నేటి యువత మాదక ద్రవ్యాలు, హెచ్ఐవి వంటి ప్రమాదకర జాడ్యాల బారినపడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలిక ఆకర్షణలకు లోనుకాకుండా విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

### లక్ష్యం వైపు అడుగులు వేయాలి..

కళాశాల ఉపాధ్యాయులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకట శేషారావు మాట్లాడుతూ.. యువత ఎలాంటి చెడు ప్రలోభాలకు తలొగ్గకుండా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించుకుని, నిర్దిష్టమైన ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని దేశ ప్రగతికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

### విద్యార్థుల ప్రతిజ్ఞ..

ఈ కార్యక్రమంలో నేతాజీ స్కౌట్ విద్యార్థులతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులంతా తాము మాదక ద్రవ్యాలు, హెచ్ఐవి, ఎయిడ్స్‌కు దూరంగా ఉంటామని ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ అవగాహన సదస్సులో ఉపాధ్యాయులు కొంగర శ్రీనివాసరావు, కొప్పోలు భాను ప్రకాష్, దిశా ఫౌండేషన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యవతి, ఏఎన్ఎం అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగే ఛాన్స్!

### నేడు ఫెడరల్ రిజర్వ్ కీలక నిర్ణయం

### 0.25 శాతం పెరిగే అవకాశం

**వాషింగ్టన్ (సమయం న్యూస్):** అమెరికాలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను పెంచేందుకు సిద్ధమవుతోంది. సమావేశంలో కీలక వడ్డీ రేటును 0.25 శాతం (25 బేసిస్ పాయింట్లు) పెంచే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం 3.50ఉ3.75 శాతం పరిధిలో ఉన్న ఫెడరల్ ఫండ్స్ రేటు ఈ పెంపుతో 3.75ఉ4.00 శాతానికి చేరవచ్చని రాయిటర్స్ సర్వే వెల్లడించింది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రుణ వ్యయాలు తగ్గించేందుకు వడ్డీ రేట్లను తగ్గించాలని ఫెడరల్ రిజర్వ్‌ను ఆయన కోరారు. ఈ అంశంపై తుది నిర్ణయం సెప్టెంబర్ 16న ఫెడ్ సమావేశం ముగిసిన అనంతరం వెలువడనుంది.

# నాగులపాడులో భీమవరం జడ్జి దంపతుల పూజలు

**పెదనందిపాడు, సెప్టెంబర్ 15:** గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడు లోని శ్రీ శృంగేరి శారదా పీఠ పాలిత శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (స్వయంభు) ఆలయాల సముదాయంలో గల శ్రీ విఘ్నేశ్వరుడికి. వినాయక చవితి సందర్భంగా. భీమవరం సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం సుధారాణి సింగారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు త్రినాధ్ శర్మ. అమర్ పాండే లు కమిటీ సభ్యులచే వినాయక చవితి సందర్భంగా వినాయకుని కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులపాడు బొడ్డురాయి సెంటర్లో గ్రామ ప్రముఖుల నేత్రత్వంలో యువకులు ఏర్పాటుచేసిన వినాయకుని పూజలు చేసేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రామాలయం వద్ద శ్రీ రామా యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక మండపం భక్తులను ఆకట్టుకుంది.



# జాతీయ స్థాయిలో గుంటూరు కీర్తి

**కమిషనర్ మయూర్ అశోక్‌కు ఘన సత్కారం**

**స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో ద్వితీయ స్థానం..**

**25 వేల మట్టి గణపతులతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు**

**గుంటూరు, సెప్టెంబర్ 15:** గుంటూరు నగరాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్‌ను పలు స్వచ్ఛంద సంస్థలు, యూనియన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. వాయు కాలుష్య నియంత్రణలో గుంటూరు నగరం కనబరిచిన విశేష ప్రతిభకు కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన లిలి"స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2026"లిలిలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం లభించడంలో కమిషనర్ మయూర్ అశోక్ కీలక పాత్ర పోషించారు. అలాగే పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏకకాలంలో 25 వేల మంది విద్యార్థులతో 25 వేల మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించి, గుంటూరు నగరం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్లో నమోదు అయ్యేలా కృషి చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రతినిధి పి. శివప్రసాద్, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వి. వెంకట నాగిరెడ్డి, ది మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ. మధుబాబు, మరాఠా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు కమిషనర్‌ను కలిసి అభినందించారు. పర్యావరణహితంగా పూల మొక్కలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. గుంటూరు నగరాన్ని స్వచ్ఛ, సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కమిషనర్ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు, చూపుతున్న చొరవ అభినందనీయమని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. భవిష్యత్తులో గుంటూరును మరిన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డు సాధించడం, గ్రీన్ గణేష్ కార్యక్రమం ద్వారా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుంటూరు నగరానికి గుర్తింపు రావడం వెనుక అధికారులు, సిబ్బంది కృషితో పాటు ప్రజాప్రతినిధుల సహకారం, ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. రానున్న రోజుల్లో నగరపాలక సంస్థ చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు మరింతగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



# కరివేపాకు ప్రాసెసింగ్ ప్లాంట్‌కు శంకుస్థాపన

**కట్టుబడివారిపాలెంలో రూ.2.33 కోట్లతో ఏర్పాటు.. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు భూమిపూజ**

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 15:** గ్రామీణ ప్రాంత మహిళలు చిన్నచిన్న రుణాలకే పరిమితం కాకుండా సొంతంగా పరిశ్రమలు స్థాపించి యజమానులుగా ఎదగాలనే లక్ష్యంతో పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెంలో రూ.2.33 కోట్ల వ్యయంతో కరివేపాకు ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. కట్టుబడివారిపాలెం, పరిసర ప్రాంతాల్లో రైతులు వందలాది ఎకరాల్లో కరివేపాకు సాగు చేస్తున్నారని, వారి ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతోనే ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ ప్లాంట్‌ను ప్రభుత్వానికి చెందినదిగా కాకుండా 'మన సొంత పరిశ్రమ' అనే భావనతో ఐక్యతగా నిర్వహించి లాభాల బాట పట్టాలని పిలుపునిచ్చారు. రైతులు కరివేపాకును పంటగా నేరుగా విక్రయించడం కంటే దానిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి పౌడర్లు, మసాలాలు తదితర ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్ చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. 'అరకు కాఫీ' బ్రాండింగ్ ద్వారా అంతర్జాతీయ స్థాయికి చేరిన విధంగానే 'స్వయం' బ్రాండింగ్‌తో స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ కల్పించుకోవాలని సూచించారు. ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రుణాలు, సబ్సిడీలు అందించడంతో పాటు ఉచిత స్థలం, తక్కువ వ్యయంతో యంత్రాలు, షెడ్ల నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో క్లస్టర్ల ద్వారా ఇలాంటి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు ఒకే తాటిపైకి వచ్చి అందుబాటులోకి వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు.




## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**రేపల్లె, సెప్టెంబర్ 15 :** రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 69 మంది లబ్ధిదారులకు రూ.72,89,587 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు వైద్య ఖర్చుల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం సకాలంలో సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందజేస్తోందన్నారు. అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఎల్ వోసీ పత్రాలు కూడా అందిస్తూ కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పేదల ఆరోగ్య సంరక్షణను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు.

## గ్రామీణ తాగునీటి పథకానికి కృషి



**వినుకొండ, సెప్టెంబర్ 15 :** వినుకొండ నియోజకవర్గ గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామీణ సమగ్ర తాగునీటి పథకం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ పట్టణ సమగ్ర తాగునీటి పథకానికి ఇప్పటికే రూ.240 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నామని, పట్టణంలో మౌలిక వసతుల కోసం మరో రూ.25 కోట్ల నిధులు తీసుకురావడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో గ్రామీణ తాగునీటి పథకాన్ని సాధిస్తామని తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 10 లక్షల ఉద్యోగాలు కల్పించామని, త్వరలో మూడు డీఎస్సీ నోటిఫికేషన్లకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న వినుకొండలో 40 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.




# గుంటూరు డివిజన్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

**57 నుంచి 76కు పెంపు.. గెజిట్ నోటిఫికేషన్ జారీ**

**గుంటూరు, సెప్టెంబర్ 15:** గుంటూరు నగరపాలక సంస్థ డివిజన్ల సంఖ్యను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 57 డివిజన్లను 76 డివిజన్లకు పెంచుతూ ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తగా 76 డివిజన్లకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. డివిజన్ల పెంపునకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఏపీ గెజిట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. డివిజన్ల పునర్విభజనతో ఎన్నికల ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకోనున్న నేపథ్యంలో తదుపరి చర్యలపై అధికారులు దృష్టి సారించనున్నారు.

## ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

**పెదనందిపాడు, సెప్టెంబర్ 15:** ప్రభుత్వ నిబంధనలు మరియు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదనందిపాడు మండలం లోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి పాఠశాల నిర్వహణ కమిటీ (రావీజ)లను పునర్వ్యవస్థీకరించేందుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పెదనందిపాడు మండల విద్యాశాఖాధికారులు శ్రీ. సి.హెచ్.రమేష్ బాబు, పి.జాకోబ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం జిల్లాలోని అన్ని యాజమాన్యా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నోటీసు బోర్డులో ఎన్నికల ప్రకటన పత్రాలను తమ తమ పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు.సెప్టెంబర్ 15 న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయ వలసినదిగాను , సెప్టెంబర్ 18న ఓటర్ల జాబితాను పాఠశాలల నోటీసు బోర్డులపై ప్రదర్శించి,సెప్టెంబర్ 25 న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి,తుది జాబితాను ప్రకటించాలని,సెప్టెంబర్ 29 న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్.ఎం.సీ. సభ్యుల ఎన్నికలు నిర్వహించాలని మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక, 2 గంటలకు ప్రమాణ స్వీకారం,3 గంటలకు తొలి ఎస్.ఎం.సీ. సమావేశం నిర్వహించ వలసినదిగాను, పాఠశాలల పర్యవేక్షణ, మెరుగైన యాజమాన్యం కోసం ప్రైవేట్ పాఠశాలలు కూడా ఎస్.ఎం.సి. లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని ఈ విషయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తగు చర్య తీసుకోవాల్సిందిగా తెలియజేశారు.

## కోమాలోకి వెళ్లిన 13 ఏళ్ల బాలికకు శస్త్రచికిత్సతో ప్రాణదానం!

**నరసరావుపేట, సెప్టెంబర్ 15:** తీవ్రమైన మధుమేహం, మ్యుకోర్ మైకోసిస్ (బ్లాక్ ఫంగస్) బారినపడి కోమాలోకి వెళ్లిన 13 ఏళ్ల బాలికకు అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్యులు ప్రాణాలు కాపాడారు. మంగళగిరి--తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఈ అరుదైన చికిత్స విజయవంతంగా పూర్తయినట్లు పిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు. గత ఏడాది కాలంగా మధుమేహంతో బాధపడుతున్న చిన్నారి తీవ్ర అస్వస్థతతో స్పృహ కోల్పోవడంతో జూలై 13న ఆసుపత్రి ఐసీయూలో చేర్చారు. వైద్యులు 24 గంటల్లోనే చక్కెర స్థాయిలను అదుపులోకి తెచ్చినప్పటికీ, తీవ్రమైన కడుపునొప్పి రావడంతో పరీక్షలు నిర్వహించగా జీర్ణకోశంలో ప్రాణాంతక బ్లాక్ ఫంగస్ ఉన్నట్లు తేలింది. దీంతో గ్యాస్ట్రో నిపుణుడు డాక్టర్ జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యవసర శస్త్రచికిత్స చేసి కాలేయంలోని కొంత భాగంతో పాటు జీర్ణాశయాన్ని తొలగించారు. అనంతరం 45 రోజుల పాటు ఐసీయూలో నిరంతరం పర్యవేక్షించి, రూ.20 నుంచి 25 లక్షల విలువైన ఈ సంక్లిష్ట చికిత్సను ఉచితంగా అందించి బాలికను సురక్షితంగా డిశ్చార్జ్ చేశారు. వైద్య బృందాన్ని ఎన్ఆర్ఐ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ ఆవుల సురేంద్ర, సీఏఓ అంజనీ కుమార్ తదితర యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

## సీనియర్ జర్నలిస్ట్ బర్త్‌డే

**మంగళగిరి, సెప్టెంబర్ 15:** సీనియర్ జర్నలిస్ట్, మంగళగిరి ప్రెస్ క్లబ్ కోశాధికారి బత్తుల సాంబశివరావు (సాంబ) జన్మదినం, వివాహ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మంగళగిరి ప్రెస్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బందెల దయాకర్, ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, సహాయ కార్యదర్శులు చదలవాడ సాయి చంద్, మెడకాయల మస్తాన్ రావు, సభ్యులు శిరందాసు భాస్కర్, ఇంధనం నాగరాజు, అన్వర్ ఖాన్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.





## తీవ్ర దుమారం రేపుతున్న
# స్పోర్ట్స్ యాప్ యాడ్

**న్యూయార్క్:** అమెరికా నటి సిడ్నీ స్వీనీతో చేసిన ఓ యాడ్ తీవ్ర దుమారం రేపుతున్నది. క్రీడల్లోని మహిళలను శృంగారభరితంగా చూపిస్తున్నట్లు ఆ యాడ్ ఉందని విమర్శలు వస్తున్నాయి. స్పోర్ట్స్ మార్కెట్ ట్రేడింగ్‌కు చెందిన నోవిగ్ యాప్‌ను నటి సిడ్నీ ప్రమోట్ చేసింది. ఆ ప్రకటనలో ఆమె దాదాపు నగ్నంగా నటించింది. అయితే ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడా వస్తువులతో ఆమె తన శరీరాన్ని కప్పుకుని ట్రేడింగ్ యాప్‌ను ప్రమోట్ చేసింది. ఇక సోషల్ మీడియాలో అనేక మంది మహిళా అథ్లెట్లు ఆ యాడ్‌ను తప్పుపట్టాడు. మహిళలను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. నాలుగు సార్లు ఒలింపిక్ స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్ గెలిచిన ఏరియార్నే టిట్‌మస్ స్పందిస్తూ ఆ యాడ్‌ను చూస్తున్నప్పుడు ఆవేశం వస్తున్నట్లు ఆమె అన్నారు. స్త్రీ శరీరాలను డబ్బు సంపాదన కోసం వాడుతుంటే, మహిళా క్రీడలు ఎలా వృద్ధి చెందుతాయని ఆమె ప్రశ్నించారు. బ్రిటీష్ స్ప్రింటర్ ఆమే హంట్, యూఎస్ జిమ్నాస్ట్ గ్రేసీ క్రామర్ కూడా ఆ యాడ్‌ను తప్పుపట్టారు. రగ్బీ ప్లేయర్ సోఫీ ఫెల్లా స్పందిస్తూ.. సిడ్నీ నటించిన యాడ్ మహిళలను కించపరిచే రీతిలో ఉన్నట్లు పేర్కొన్నది. నటి స్వీనీ గతంలో రెండు సార్లు ఎమ్మీ అవార్డుకు నామినేట్ అయ్యింది. అమెరికన్ ప్రొఫెషన్ బాక్సర్ క్రిస్టీ మార్టిన్ బయోపిక్‌పై తీసిన క్రిస్టీలో ఆమె నటించింది.



## వన్డేల్లో తొలి శతకంతో రెచ్చిపోయిన
# ఆసీస్ కుర్రాడు

- జింబాబ్వేపై మ్యాట్ రెన్‌షా తొలి వన్డే శతకం
- 94 బంతుల్లో 109 పరుగులతో విధ్వంసం
- ఏడు ఫోర్లు.. మూడు సిక్సర్లతో మెరుపులు
- 107కే నాలుగు వికెట్లు పడినా ఆసీస్‌కు అండ
- ప్రపంచకప్ ముందు ఆరో స్థానానికి కొత్త ఆశ

**హరారే, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** టెస్టుల్లో నిరాశపరిచాడు.. వన్డేల్లో మాత్రం బ్యాట్‌తో సమాధానం చెప్పాడు! మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం చేసినా బంగ్లాదేశ్‌పై ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఆస్ట్రేలియా బ్యాటర్ మ్యాట్ రెన్‌షా.. జింబాబ్వేపై తొలి వన్డే శతకంతో చెలరేగిపోయాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో 94 బంతుల్లో ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 109 పరుగులు సాధించి ఆసీస్‌కు భారీ స్కోరు అందించాడు. ఆస్ట్రేలియా టాపార్డర్ విఫలమవడంతో ఒక దశలో 107 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో 18వ ఓవర్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రెన్‌షా జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఆరంభంలో పరిస్థితులకు అనుగుణంగా ఆడిన అతడు ఆ తర్వాత భారీ షాట్లతో స్కోరు వేగాన్ని పెంచాడు.

### బ్రాడ్ ఎవాన్స్ ఓవర్‌లో సెంచరీ

బ్రాడ్ ఎవాన్స్ బౌలింగ్‌లో సింగిల్ తీసి రెన్‌షా తన వన్డే కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టును పటిష్ట స్థితికి చేర్చాడు. రెన్‌షా మెరుపులతో ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పుపై కసరత్తు చేస్తున్న ఆస్ట్రేలియాకు రెన్‌షా ఇన్నింగ్స్ కొత్త ఆశలు కలిగించింది. ముఖ్యంగా ఆరో స్థానంలో దూకుడుగా ఆడగల బ్యాటర్‌గా అతడు తన అవకాశాలను బలపరుచుకున్నాడు. తొలి వన్డే సెంచరీతో అదరగొట్టిన రెన్‌షా ఇక జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకుంటాడా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆసియా క్రీడల్లో 'యంగ్ పవర్'




- వైభవ్ నుంచి అలెగ్జాండ్రా ఈలా వరకు యువ సంచలనాలు
- స్విమ్మింగ్‌లో యు జిడి.. ఒహాషిపై భారీ అంచనాలు
- జావెలిన్‌లో పతిరాగేకు స్వర్ణావకాశాలు
- జిమ్నాస్టిక్స్‌లో నిషియామా సత్తా చాటేనా?
- టెన్నిస్‌లో బంగారమే లక్ష్యంగా ఈలా బరిలోకి

**నాగోయా, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఆసియా క్రీడల సమరానికి జపాన్‌లోని నాగోయా–ఐచి వేదిక సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఈ మెగా క్రీడా సంగ్రామంలో అనుభవజ్ఞులతోపాటు యువ సంచలనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న ఆరుగురు యువ క్రీడాకారులు ఈసారి పతకాలపై కన్నేశారు. చైనా స్విమ్మర్ యు జిడి నుంచి భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, ఫిలిప్పీన్స్ టెన్నిస్ తార అలెగ్జాండ్రా ఈలా వరకు వీరి ప్రదర్శనపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

### పదమూడేళ్లకే కొలనులో సంచలనం

చైనాకు చెందిన యు జిడి అతి చిన్న వయసులోనే స్విమ్మింగ్‌లో సంచలన ప్రదర్శనలతో దూసుకొచ్చింది. 2025 ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 12 ఏళ్ల వయసులోనే 4ఐ200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలేలో కాంస్యం సాధించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. వ్యక్తిగతంగా మూడు ఈవెంట్లలో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకాలు చేజార్చుకుంది. ఈ ఏడాది మార్చిలో 200 మీటర్ల బటర్‌ఫ్లైలో అమెరికా ఒలింపిక్ ఛాంపియన్ రెగన్ స్మిత్‌ను ఓడించింది. ఆసియా క్రీడల్లో 200 మీటర్ల బటర్‌ఫ్లైతోపాటు 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో బరిలోకి దిగనుంది. వచ్చే నెలలో 14 ఏళ్లు పూర్తి చేసుకోనున్న యు జిడి భవిష్యత్‌లో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా ముందుకెళ్తోంది.

### జావెలిన్‌లో పతిరాగే పవర్

శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల రుమేష్ తరంగ పతిరాగే ఈ ఏడాది జావెలిన్ త్రోలో ప్రపంచ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించాడు. డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన తొలి శ్రీలంక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జూన్ 4న రోమ్ డైమండ్ లీగ్‌లో 92.62 మీటర్లు విసిరి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. గత నెల జ్యూరిచ్‌లో 92.07 మీటర్లతో మరోసారి 92 మీటర్ల మార్కును దాటాడు. ఈ ఘనతను రెండుసార్లు అందుకున్న చరిత్రలో నాలుగో ఆటగాడిగా నిలిచాడు. ఆసియా క్రీడల్లో పాకిస్థాన్ స్టార్ అర్షద్ నదీమ్ నుంచి అతడికి ప్రధాన పోటీ ఎదురుకానుంది. 92.97 మీటర్లతో ఆసియా రికార్డు నదీమ్ పేరిట ఉన్నప్పటికీ ప్రస్తుతం అతడి ఫామ్‌పై సందేహాలు ఉన్నాయి. భారత స్టార్ నీరజ్ చోప్రా గాయం కారణంగా బరిలో లేకపోవడంతో పతిరాగే స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుగా కనిపిస్తున్నాడు.

### సొంతగడ్డపై ఒహాషి జోరు

జపాన్‌కు చెందిన 17 ఏళ్ల షిన్ ఒహాషి స్విమ్మింగ్‌లో కొత్త తరం స్టార్‌గా ఎదుగుతున్నాడు. 169 సెంటీమీటర్ల ఎత్తున్న ఒహాషి తనకు జంక్‌ఫుడ్ అంటే ఇష్టమని చెప్పడం విశేషం. అయితే కొలనులో మాత్రం అతడి వేగం ప్రత్యర్థులకు సవాల్‌గా మారుతోంది. ఈ ఏడాది 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో చైనా స్టార్ క్విన్ హైయాంగ్ ప్రపంచ రికార్డుకు సెకను కంటే తక్కువ తేడాతో చేరుకున్నాడు. అదే ప్రదర్శనతో జూనియర్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లో క్విన్ హైయాంగ్‌తో మరోసారి అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాడు.

### వైభవ్ బ్యాట్ పేలుతుందా?

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు ఉన్నాయి. పురుషుల టీ20 క్రికెట్‌లో ఆసియా క్రీడల టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తున్న భారత్‌కు వైభవ్ కీలక ఆటగాడిగా మారనున్నాడు.

ఐపీఎల్ 2026లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన వైభవ్.. ఆ ప్రదర్శనతో ఇంగ్లండ్ పర్యటనకు భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో అరంగేట్ర మ్యాచ్‌లోనే రెండు సిక్సర్లు బాదాడు. అనంతరం జింబాబ్వేపై 18 బంతుల్లో తొలి టీ20 అంతర్జాతీయ అర్ధసెంచరీ సాధించాడు. ఆ తర్వాత 49 బంతుల్లో 81 పరుగులతో మరో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పుడు ఆసియా క్రీడల్లోనూ అతడి బ్యాట్ నుంచి అలాంటి మెరుపులనే అభిమానులు ఆశిస్తున్నారు.

### జిమ్నాస్టిక్స్‌లో నిషియామా మెరుపులు

జపాన్‌కు చెందిన 16 ఏళ్ల మిసా నిషియామా సీనియర్ స్థాయిలోకి అడుగుపెట్టిన వెంటనే తన ప్రతిభతో ఆకట్టుకుంది. 2025లో జూనియర్ ఫ్లోర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఆమె.. ఈ ఏడాది ఏప్రిల్‌లో జపాన్ ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. అనంతరం ఎన్‌హెచ్‌కే ట్రోఫీలోనూ స్వర్ణం సాధించింది. చిన్నతనంలో బ్రెజిలియన్ జియు--జిట్సుపై ఆసక్తి చూపిన నిషియామా ఐదేళ్ల వయసులో జిమ్నాస్టిక్స్ శిక్షణ ప్రారంభించింది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో మహిళల టీమ్ ఈవెంట్‌లో జపాన్‌కు పతకం అందించాలన్నది ఆమె లక్ష్యం. 1964 తర్వాత ఈ విభాగంలో జపాన్‌కు పతకం దక్కకపోవడంతో ఆమెపై భారీ ఆశలు ఉన్నాయి.

### ఈలా గురి.. ఈసారి బంగారమే

ఫిలిప్పీన్స్‌కు చెందిన అలెగ్జాండ్రా ఈలా టెన్నిస్‌లో యువ సంచలనంగా ఎదుగుతోంది. ఈ ఏడాది తొలి డబ్ల్యూటీఏ టైటిల్‌ను సాధించడంతోపాటు వింబుల్డన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. గత నెల వాషింగ్టన్ టైటిల్ సాధించే క్రమంలో ప్రపంచ మూడో ర్యాంకర్ జెస్సికా పెగులాను ఫైనల్లో ఓడించింది. నవోమీ ఒసాకా, ఎలీనా స్విటోలినా, లేలాహ్ ఫెర్నాండెజ్, జెంగ్ క్విన్‌వెన్ వంటి ప్రముఖులపైనా విజయాలు సాధించింది. కెరీర్‌లో అత్యుత్తమంగా ప్రపంచ 18వ ర్యాంకుకు చేరుకున్న ఈలా.. గత హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో 18 ఏళ్ల వయసులోనే కాంస్యం సాధించింది. సెమీఫైనల్లో జెంగ్ చేతిలో ఓడిపోయిన ఆమె ఈసారి ఆ అనుభవాన్ని ఉపయోగించుకుని స్వర్ణం సాధించాలన్న పట్టుదలతో ఉంది. గత ఏడాది సీ గేమ్స్‌లోనూ స్వర్ణం సాధించిన ఈలా.. ఇప్పుడు ఆసియా క్రీడల బంగారంపై గురిపెట్టింది.

# ఆసియా కప్ దెబ్బకు ర్యాంకింగ్స్ తారుమారు!

- అగ్రస్థానంలో తెలుగమ్మాయి శ్రీ చరణి
- 804 పాయింట్లతో మరింత పటిష్టం
- రెండో ర్యాంకుకు దూసుకెళ్లిన దీప్తి శర్మ
- బ్యాటింగ్‌లో షెఫాలీకి ఆరో స్థానం
- ర్యాంకింగ్స్‌లో భారత అమ్మాయిల జోరు



**దుబాయ్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఆసియా కప్ గెలిచిన జోష్‌లో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టు.. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటింది. మహిళల ఆసియా కప్--2026లో అద్భుతంగా రాణించిన భారత క్రికెటర్లు తాజా ర్యాంకింగ్స్‌లో గణనీయమైన పురోగతి సాధించారు. ముఖ్యంగా తెలుగమ్మాయి ఎన్. శ్రీ చరణి బౌలింగ్‌లో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగా.. దీప్తి శర్మ రెండో స్థానానికి దూసుకెళ్లింది. శ్రీలంకతో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో శ్రీ చరణి నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత విజయంలో ప్రధాన పాత్ర పోషించింది. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన ఆమె అంతర్జాతీయ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 800 రేటింగ్ పాయింట్ల మార్కును అధిగమించింది. ప్రస్తుతం 804 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతూ తన ఆధిపత్యాన్ని మరింత బలపరుచుకుంది. ఈ ప్రదర్శనతో కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకున్న శ్రీ చరణి.. భారత మహిళల క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఆసియా కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరిగా నిలిచిన దీప్తి శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో భారీగా పురోగమించింది. నాలుగు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకును కైవసం చేసుకుంది. దీంతో టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తొలి రెండు స్థానాల్లో భారత బౌలర్లే నిలవడం విశేషం. బ్యాటింగ్ విభాగంలో షెఫాలీ వర్మ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకుంది. ఆసియా కప్‌లో పరుగుల వరద పారించిన షెఫాలీ.. కీలక మ్యాచ్‌ల్లో దూకుడైన బ్యాటింగ్‌తో భారత్‌కు బలంగా నిలిచింది. స్మృతి మంధాన ఐదో స్థానంలో కొనసాగుతుండగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పదో స్థానంలో నిలిచింది. ఆల్‌రౌండర్ల విభాగంలోనూ షెఫాలీ వర్మ దూసుకెళ్తూ కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను అందుకుంది. ఆసియా కప్ ట్రోఫీని సొంతం చేసుకోవడమే కాకుండా.. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండ్ విభాగాల్లో భారత క్రీడాకారిణులు అగ్రస్థానాల వైపు దూసుకెళ్లడం టీమిండియా ఆధిపత్యాన్ని చాటుతోంది.



# నయనతార కంబ్యాక్ ఇస్తుందా?

## 'మహాశక్తి'పైనే ఆశలు!

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** తనదైన లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో సౌత్ ఇండియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లేడీ సూపర్ స్టార్ నయనతార, ప్రస్తుతం విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'టాక్సిక్', 'హాయ్' చిత్రాలు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోవడంతో ఆమె సక్సెస్ ట్రాక్ కాస్త మందగించింది. యష్ సరసన 'టాక్సిక్'లో అక్క గంగ పాత్రలో కనిపించినా, కవిన్‌తో చేసిన ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ 'హాయ్' రొటీన్ కథతో కమర్షియల్ బూస్ట్ ఇవ్వలేకపోయాయి. దీంతో వరుసగా రెండు పరాజయాల తర్వాత ఆమె నటిస్తున్న 'మహాశక్తి' సినిమాపై అంచనాలతో పాటు తీవ్రమైన ఒత్తిడి కూడా నెలకొంది. గతంలో 'మూకుతి అమ్మన్' (తెలుగులో 'అమ్మోరు తల్లి') చిత్రంలో అమ్మవారి పాత్రలో నయనతార మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ఫ్రాంచైజీకి సీక్వెల్‌గా 'మూకుతి అమ్మన్ 2'ను తెలుగు ప్రేక్షకులకు 'మహాశక్తి' పేరుతో అందిస్తున్నారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం డివైన్ ఫ్యాంటసీ, యాక్షన్, భారీ వీఎఫ్ఎక్స్ తో రూపుదిద్దుకుంటోంది. రెజీనా విలన్‌గా, దునియా విజయ్, యోగిబాబు, ఊర్వశి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్ విజువల్స్ ఆకట్టుకున్నప్పటికీ, కథా బలంతో పాటు విఎఫ్ఎక్స్ క్వాలిటీయే ఈ సినిమా భవితవ్యాన్ని తేల్చనున్నాయి. మరి ఈ భక్తిరస ఫ్యాంటసీ చిత్రంతో నయనతార గ్రాండ్ కంబ్యాక్ ఇస్తుందో లేక హ్యాట్రిక్ డిజాస్టర్ ఆమె ఖాతాలో చేరుతుందో వేచి చూడాలి.

# కిరీటం మిస్సయినా.. 'గూగుల్'లో మళ్లీ బిజీ!

### విధుల్లో చేరిన మిస్ యూనివర్స్ ఇండియా ఫైనలిస్ట్

### గూగుల్ క్లౌడ్‌లో ఇంజనీర్‌గా ఉమాంగ్ కుమావత్

**బెంగళూరు, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** ఇటీవల జైపూర్‌లో ముగిసిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' అందాల పోటీల్లో ఫైనలిస్ట్‌గా నిలిచిన ఉమాంగ కుమావత్ మళ్లీ తన దినచర్యలో బిజీ అయిపోయారు. పోటీల్లో టైటిల్ దక్కకపోయినా ఆ బాధను పక్కనపెట్టి, బెంగళూరులోని గూగుల్ క్లౌడ్ (+శీశీస్త్రశ్రీవ జశ్రీశీబఐ) ఆఫీస్‌లో ఐటీ ఇంజనీర్‌గా తన విధుల్లో తిరిగి చేరారు. సెప్టెంబర్ 14న ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న 'డే ఇన్ మై లైఫ్' వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఆఫీస్‌లో పనిచేయడం, వెల్‌నెస్ సెంటర్‌లో వర్కవుట్లు, కాఫీ బ్రేక్స్ వంటి దృశ్యాలతో కూడిన ఈ వీడియో చూసి ఆఫీస్ సహచరులు, నెటిజన్లు ఆమె ఆత్మవిశ్వాసాన్ని అభినందిస్తున్నారు.

ఇదిలా ఉండగా, జైపూర్‌లోని జీ స్టూడియోలో జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' గ్రాండ్ ఫినాలేలో కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో విజేతగా నిలిచారు. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది సుందరీమణులను వెనక్కి నెట్టి కజియా ఈ టైటిల్‌ను సొంతం చేసుకోగా, మాజీ మిస్ యూనివర్స్ ఇండియా మనిక విశ్వకర్మ ఆమెకు కిరీటాన్ని అలంకరించారు. ఈ పోటీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రతినిధ్యం వహించిన గూగుల్ ఇంజనీర్ ఉమాంగ కుమావత్, టైటిల్ సాధించలేకపోయినా కార్పొరేట్ లైఫ్‌కు తిరిగొచ్చి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.








# 2న ప్రేక్షకుల ముందుకు 'అనకాపల్లి' చిత్రం!

భవ్య శ్రీ మూవీ మేకర్స్ మరియు నక్కిన నెరేటివ్స్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అనకాపల్లి' సినిమా విడుదలకు సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నటుడిగా, నిర్మాతగా ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన మరియు కాండ్రేగుల నాయుడు కీలక పాత్రలు పోషిస్తూ నిర్మాణ బాధ్యతలు కూడా నిర్మించారు. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ సినిమాకు ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ, కథ మరియు స్క్రీన్‌ప్లే రూపకల్పనలో తన వంతు సహకారం అందించారు.

# వినాయక చవితికి 'ఫీల్ మై లవ్' స్పెషల్ ట్రీట్

## ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన చిత్రబృందం




**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (సమయం న్యూస్):** వినాయక చవితి సందర్భంగా 'ఫీల్ మై లవ్' చిత్రబృందం ప్రేక్షకులకు ప్రత్యేక కానుక అందించింది. శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ పతాకంపై నిర్మాత బాలాజీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి వినాయక చవితి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రధాన తారాగణమంతా కనిపించేలా రూపొందించిన పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోందని చిత్రబృందం పేర్కొంది. యువతతోపాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రేమ, కామెడీ, భావోద్వేగాల సమాహారంగా ఈ ఫీల్‌గుడ్ చిత్రాన్ని దర్శకుడు హరి ప్రకాష్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్‌కు మంచి స్పందన లభించిందని, తాజాగా పండుగ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయని మేకర్స్ తెలిపారు. ఆదిత్య భాస్కర్, ఐరా, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. మధుసుదన్‌రావు, రాజయ్యప్ప, నోబెల్ జేమ్స్, ప్రియాంక తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథతోపాటు విజువల్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ చెన్నై, పుదుచ్చేరి, మున్నార్, కొడైకెనాల్ వంటి సుందరమైన ప్రదేశాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. లొకేషన్లు, ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం ధీమా వ్యక్తం చేసింది. సినిమా ప్రచార కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు మేకర్స్ ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలో ఆడియో విడుదల వేడుక వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రేక్షకులను నేరుగా కలవాలని నిర్ణయించారు.

# టాలీవుడ్‌కు గుడ్ బై

### అను ఇమ్మాన్యుయేల్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్:** నాని హీరోగా వచ్చిన 'మజ్ను' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టి, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ వంటి అగ్ర కథానాయకుల సరసన నటించిన మలయాళ బ్యూటీ అను ఇమ్మాన్యుయేల్ సినిమాలకు తాత్కాలికంగా గుడ్‌బై చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. అందం, అభినయం ఉన్నప్పటికీ కెరీర్ ఆశించిన స్థాయిలో సాగకపోవడం, వరుస పరాజయాలు ఎదురుకావడంతో ఆమె పరిశ్రమకు దూరమవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. భారత్‌ను వీడి తన స్వస్థలమైన అమెరికాలోని చికాగోకు శాశ్వతంగా వెళ్లిపోయినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్ల క్రితం అల్లు శిరీష్ సరసన 'ఊర్వశివో రాక్షసివో' చిత్రంలో బోల్డ్ పాత్రలో మెప్పించినప్పటికీ ఆమెకు ఆశించిన అవకాశాలు రాలేదు. ఆ తర్వాత తమిళంలో కార్తి సరసన చేసిన 'జపాన్' చిత్రం కూడా డిజాస్టర్ కావడంతో అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. మెగా కాంపౌండ్‌లోని పలువురు హీరోలతో కలిసి నటించినా కాలం కలసి రాలేదు. అమెరికాలోనే పుట్టి పెరిగిన అను ఇమ్మాన్యుయేల్, అక్కడ తన కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, రష్మిక మందన్న ప్రధాన పాత్రలో వచ్చిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఆమె చివరి తెలుగు చిత్రంగా నిలిచింది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**